
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం : 30 : జూలై : 2025



12,231 క్యూసెక్కుల వరద

జలాశయంలో మంగళవారానికి 31.250 టీఎంసీలు ఉన్నాయి. 12,231 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, పవర్ టర్నల్ ద్వారా 2800, దిగువ వివిధ కాలువలకు 1,720 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.1,01,310
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.9,171
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,446
సవర (8 గ్రాములు)	రూ.75,568

గరిష్టం/కనిష్టం
36.6 /28.5

వాతావరణం

జిల్లాలో బుధవారం పగలు వాతావరణం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. రాత్రి వర్షసూచన ఉంది. మంగళవారం గాలిలో తేమ 43 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణికి బెయిల్ మంజూరు



నెల్లూరు (లీగల్): పొదలకూరు మండలం విరువూరులో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచారని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని పొదలకూరు ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన అక్రమ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ మంగళవారం గూడూరు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బీవీ సులోచనరాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కొక్కరు రూ.లక్ష ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామీన్‌దార్లు పూచీకత్తు, రూ.లక్ష వ్యక్తిగత బాండ్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. గోవర్ధన్‌రెడ్డి ఎక్సైజ్ అధికారుల విచారణకు సహకరించాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ కేసులో కాకాణి గోవర్ధన్‌రెడ్డిని 9వ నిందితుడిగా కేసు నమోదు చేసి జూలై 14న పీటీ వారెంట్‌పై గూడూరు కోర్టులో హాజరు పరచడంతో జూలై 28 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రాజారెడ్డి పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు చేసి కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్షతో కేసును బనాయించారని వాదనలు వినిపించారు. ఎక్సైజ్ అధికారుల తరఫున స్పెషల్ పీపీ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నల్లపరెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ నేతల భేటీ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగరంలోని సుజాతమ్మ కాలనీలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు భేటీ అయ్యారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రసన్న నివాసానికి రానున్న నేపథ్యంలో నెల్లూరు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లపై చర్చించారు.

4న విచారణకు రావాలని అనిల్‌కు నోటీసు

కోవూరు: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో విచారణ నిమిత్తం ఆగస్టు 4వ తేదీ హాజరు కావాలని మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్‌కు మంగళవారం మరోమారు నోటీసు జారీ చేశారు. తొలుత ఈ నెల 26న కోవూరు సర్కిల్ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలని నోటీసు ఇచ్చిన నేపథ్యంలో అందుబాటులో లేని కారణంగా మరో రోజు వస్తానని పోలీసులకు అనిల్ సమాచారమిచ్చారు. ఈ మేరకు ఈ నెల 30న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని సోమవారం నోటీసులు జారీ చేశారు. అయితే ఈ నెల 31న మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన ఉండడంతో పోలీసులు బందోబస్తు నిమిత్తం వెళ్తుండడంతో ఆగస్టు 4న విచారణకు రావాల్సిందిగా సూచిస్తూ తాజాగా మరో నోటీసులు ఇచ్చారు.

జన ప్రభంజనంపై పోలీస్ ఉక్కుపాదం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయటకు వస్తుంటే తరలి వచ్చే జన ప్రభంజనాన్ని చూసి కూటమి నేతలు భయకంపితులు అవుతున్నారు. ఆయన పర్యటన విజయవంతం కాకూడదని అడుగడుగునా అడ్డంకులు, ఆంక్షలతో అడ్డుకునే కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. అక్రమ కేసులతో సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్, టీడీపీ ముష్కరులు, కిరాయి రౌడీమూకలు సాగించిన విధ్వంసంలో దెబ్బతిన్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిని పరిశీలించి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైఎస్ జగన్ గురువారం జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో భారీగా జనం తరలివచ్చే అవకాశాలు ఉన్నాయన్న ఇంటెలిజెన్స్ నివేదికల నేపథ్యంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. జిల్లా జైలు పరిసరాల నుంచి నగరంలోని అన్ని రహదారులను పోలీస్ బలగాలతో అష్టదిగ్బంధం చేస్తున్నారు. ఎవరైనా వస్తే కేసులు నమోదు చేస్తామని ఎక్కడికక్కడ ప్రజాభిమాన్ని కట్టడి చేసేందుకు పోలీసులు బెదిరిస్తున్నారు.

- అన్ని రహదారుల్లో బారికేడ్లు పెట్టి అడ్డుకునే యత్నాలు
- వైఎస్ జగన్ భద్రత కంటే.. ప్రజాభిమానాన్ని అడ్డుకునేందుకు భారీగా బలగాల మోహరింపు
- నెల్లూరు సిటీ, రూరల్, సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల్లోని వైఎస్సార్‌సీపీ కేడర్‌కు ఫోన్ల ద్వారా హెచ్చరికలు
- నిబంధనలు అతిక్రమించి వస్తే కేసులు నమోదు చేస్తామని బెదిరింపులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరు పర్యటన నేపథ్యంలో పోలీసులు అష్టదిగ్బంధం చర్యలు చేపడుతున్నారు. జెడ్‌ప్లస్ భద్రత ఉన్న ఆయన భద్రతకు కేటాయించే బలగాలను తగ్గించి, ప్రజాభిమానంపై పోలీస్ గన్ గురిపెట్టి జన ప్రభంజనాన్ని అడ్డుకునేందుకు అత్యుత్సాహం చూపిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పనిచేసే పోలీసులు ప్రతిపక్ష నేత పర్యటలను అడ్డుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. గంటకో నిబంధనల పేరుతో నోటీసులు ఇస్తూ నేతలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ఇంటెలిజెన్స్ నివేదికలతో..

వైఎస్సార్‌సీపీకి ప్రజాభిమానం మెండుగా ఉండే జిల్లాల్లో నెల్లూరు ఒకటి. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తే ఊహించని స్థాయిలో ప్రజలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రభుత్వానికి అందాయి. ఈ క్రమంలో వైఎస్ జగన్ పర్యటన ఈ నెల 3న తొలిసారి షెడ్యూల్ ఖరారు కావడంతో ప్రభుత్వం, పోలీసులు అనేక అడ్డంకులు సృష్టించి ఆఖరి నిమిషం వరకు హెలిప్యాడ్‌కు స్థలాన్ని కేటాయించకుండా అడ్డంకులు సృష్టించారు. ఈ దఫా ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆయన పర్యటన కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ స్పష్టం చేయడంతో విధిలేని పరిస్థితుల్లో ముందుగానే ఏర్పాట్లకు పోలీస్‌శాఖ సన్నద్ధమైంది. అయితే ఈ దఫా పర్యటనకు ప్రాధాన్యత పెరిగింది. అప్పుడు జిల్లా జైల్లో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ కావడానికి వైఎస్ జగన్ టూర్ ఖరారైంది. ఒక వేళ ప్రభుత్వ పెద్దలు కుట్రలు చేసి కాకాణిపై పీటీ వారెంట్ జారీ చేయించి జిల్లా జైల్లో లేకుండా చేస్తే పొదలకూరు రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించాలని భావించారు. అయితే ఆ తర్వాత ఈ నెల 7వ తేదీ మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంట్లో టీడీపీ ముష్కరులు, కిరాయి రౌడీమూకలు విధ్వంసం చేయడం తెలిసిందే. దీంతో కాకాణితో ములాఖత్ కావడంతో పాటు ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు రానున్న నేపథ్యంలో వైఎస్ జగన్ పర్యటనకు ప్రాధాన్యతను సంతరించుకుంది. దీంతో సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాలతోపాటు మిగతా నియోజకవర్గాల నుంచి కూడా భారీగా అభిమానులు, ప్రజలు వచ్చే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ తాజాగా నివేదిక ఇచ్చింది. దీంతో పోలీసులు నగరం చుట్టూ బ్యారికేడ్లు పెట్టి ఎవరూ రాకూడదని, వస్తే కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు హెచ్చరికలు చేస్తోంది. ఇప్పటికే ఈ నాలుగు నియోజకవర్గాల్లో ఎవరెవరు వస్తారు, ఎంత మంది వచ్చే అవకాశం ఉందో చెప్పాలంటూ పోలీసులు స్థానికంగా ఆరా తీస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలందరికి జనాన్ని సమీకరించడానికి వీల్లేదంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

జిల్లాలో అఖండ జనాదరణ

మాజీ సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్రంలో రోజు రోజుకు జనాదరణ పెరుగుతోంది. ఏ ప్రాంతానికి వెళ్లినా వేలాది మంది అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి పర్యటనను విజయవంతం చేస్తున్నారు. కూటమి పాలన ఏడాదిలోనే పూర్తిగా వైఫల్యం చెందడంతో జగన్‌కు సంఘీభావం తెలిపేందుకు జన ప్రభంజనమై కదలి వస్తున్నారు. జనాదరణ చూసి గతేడాది జరిగిన ఎన్నికల్లో కూటమి గెలుపుపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలు కూటమి ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. రాప్తాడు నుంచి తెనాలి, ప్రకాశం జిల్లా పొదిలి, పల్నాడు జిల్లా సత్తెనపల్లి, చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యంలో వైఎస్ జగన్ పర్యటనల్లో పోలీసులు సృష్టించిన అడ్డంకులను అధిగమించి జనం పొలాలు, కాలి బాటల్లో పరుగులు తీస్తున్న జన సందోహంతో కూటమి నేతలకు వణుకు పుడుతోంది.



ప్రజాభిమానం ఆపేందుకు కుట్ర

వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమంతో సంతోషంగా గడిపిన ప్రజలు కూటమి పాలన వ్యతిరేకతతో వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలిపేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా దారిపొడవునా జేజేలు పలుకుతున్నారు. రోజురోజుకు ప్రజాభిమానం మెండువ్వడంతో కూటమి నేతలకు మింగుడు పడటం లేదు. తాజాగా నెల్లూరు పర్యటనతో రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యే రీతిలో జన ప్రభజనం పోటెత్తే అవకాశం ఉంది. దీంతో కూటమి పెద్దలు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయిస్తున్నారు. ప్రజాభిమానాన్ని అడ్డుకునేందుకు చేయని కుట్రలు లేవు. పోలీస్‌శాఖను పూర్తిగా ఉపయోగించి ఎక్కడికక్కడ ప్రజాభిమాన్ని అడుకునేలా కుయుక్తులు పన్నుతున్నారు. జెండాలు, ఫ్లెక్సీలు, ఫ్లకార్డులు పట్టుకుని వచ్చినా.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నెల్లూరుకు వచ్చే అన్ని దారుల్లో పోలీస్ బలగాలను పెట్టి అడ్డుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. పోలీస్‌శాఖ అత్యుత్సాహం చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నచ్చిన నేతను చూసేందుకు కూడా అనుమతులు లేవా? అంటూ ఆక్రోషం వ్యక్తం చేస్తున్నారు.

భద్రతపై ఇన్‌చార్జి ఎస్పీతో ఎమ్మెల్సీల భేటీ

నెల్లూరు (క్రైమ్): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 31న నెల్లూరులో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను కలిశారు. జగన్‌మోహన్‌రెడ్డి భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. ఆయన జెడ్‌ప్లస్ కేటగిరీలో ఉన్నారని, అందుకు అనుగుణంగా భద్రత కల్పించాలని ఎస్పీని కోరారు. ఆ మేరకే జగన్‌మోహన్‌రెడ్డికి పటిష్ట భద్రత కల్పిస్తామని, రోప్ పార్టీలు, క్యూఆర్ టీమ్‌లు ఏర్పాటు చేస్తామని ఎస్పీ చెప్పారు. అయితే ఆంక్షలు మాత్రం అమల్లో ఉంటాయన్నారు.

ఖాకీల కఠిన ఆంక్షలు

వైఎస్ జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చినా.. పోలీస్‌శాఖ కఠిన ఆంక్షలు పెడుతోంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనలో ఎవరూ పాల్గొనకూడదని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రకటన చేయడంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. హెలిప్యాడ్ వద్దకు కేవలం 10 మంది మాత్రమే వెళ్లాలంటా. సెంట్రల్ జైలు నుంచి నెల్లూరు నగరంలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి చేరుకోవాలంటే ర్యాలీగా వెళ్లకూడదంట. కేవలం జగన్ కాన్వాయ్‌లో భద్రత వాహనాలతోపాటు 15 వాహనాలకే అనుమతి ఇస్తారంటా. ప్రసన్న కుటుంబ సభ్యులను పరామర్శించి అక్కడే మీడియాతో మాట్లాడాలని మెలిక పెట్టారు. అక్కడకు మాత్రం వంద మంది మాత్రమే వెళ్లాలని నిబంధనలు పెట్టారు. జిల్లా కేంద్రంలో మీడియా ప్రతినిధులే వంద మందికి పైగా ఉంటారు. ఈ లెక్కన జగన్‌తో కలిసి ఒక్క లీడర్ కూడా వెళ్లకూడదనే షరతు విధించారు. ఒక వేళ జగన్‌ను చూసేందుకు వచ్చే ప్రతి 25 మందికి ఒకరు సూపర్‌వైజింగ్ చేసేలా లీడర్ పేరు వివరాలు ఇవ్వాలని. ఇలా కఠిన ఆంక్షలతో అభిమానాన్ని అడ్డుకునేందుకు పోలీస్ శాఖ చూపిస్తున్న అత్యుత్సాహంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

జగన్ పర్యటనకు పటిష్ట బందోబస్తు

- అమల్లో 30 పోలీసు యాక్ట్
- హెలిప్యాడ్ వద్దకు 10 మందికే అనుమతి
- ఆంక్షలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు
- ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

నెల్లూరు (క్రైమ్): మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 31న నెల్లూరు పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. నెల్లూరు నగరంలో 30 పోలీసు యాక్ట్ అమల్లో ఉన్న దృష్ట్యా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిషేధమని చెప్పారు. మంగళవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా తీసుకుంటున్న చర్యలపై ఆయన వివరాలు వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్యలో డీటీసీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి జిల్లా కేంద్ర కారాగారానికి చేరుకుని రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అవుతారన్నారు. హెలిప్యాడ్ వద్దకు కేవలం 10 మందికి మాత్రమే అనుమతి ఉందని, జైలు నిబంధనల మేరకు ములాఖత్‌కు ముగ్గురు మాత్రమే వెళుతారన్నారు. వీరు మినహా మిగిలిన వారికి ఎవరికి జైలు వద్దకు అనుమతుల్లేవని స్పష్టం చేశారు. ప్రజలు ఎవరూ రావొద్దని వస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ములాఖత్ అనంతరం రోడ్డు మార్గాన సుజాతమ్మ కాలనీలోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడుతారన్నారు. అక్కడికి 100 మందికి మాత్రమే అనుమతి ఉందన్నారు. పోలీసు ఆంక్షలను దాటుకుని ఎవరైనా వస్తే చర్యలు తప్పవన్నారు. రోడ్‌షోలు, వాహన ర్యాలీలకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. రెచ్చగొట్టే విధంగా ఫ్లకార్డులు, పోస్టర్లు ప్రదర్శించినా, నినాదాలు చేసినా చర్యలు తప్పవన్నారు. ఆరు డ్రోన్లు, 40 సీసీ కెమెరాలతో పర్యటన మొత్తం రికార్డు చేస్తామని, కమాండ్ కంట్రోల్ నుంచి లైవ్ పర్యవేక్షిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఎస్బీ, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు ఎ. శ్రీనివాసరావు, పి. సిందుప్రియ, ఘట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలతో వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకోలేరు

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు

వెంకటాచలం: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనను ఆంక్షలతో కూటమి ప్రభుత్వం అడ్డుకోలేదని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ నెల 31న వైఎస్ జగన్ నెల్లూరుకు రానున్న నేపథ్యంలో మండలంలోని చెముడుగుంట వద్దనున్న సెంట్రల్ జైలు సమీపంలో జరుగుతున్న హెలిప్యాడ్ పనులను జిల్లాలోని ముఖ్య నేతలతో కలిసి కారుమూరి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటను విజయవంతం కాకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగడుగునా కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఆంక్షలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని అడ్డుకోలేరన్నారు. ఇదే విధమైన ఆంక్షలు విధించి ఉంటే చంద్రబాబు, లోకేశ్ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజల్లో తిరిగే వారా అని ప్రశ్నించారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తూ, ప్రజల అభిమానాన్ని పొందాలే గానీ, ప్రతి పక్ష నాయకుల పర్యటనలను అడ్డుకునే కుట్రలు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలు అడ్డుకుంటున్న అధికారులను కూడా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామని చెప్పారు.

పోలీసులు కుట్రలు దారుణం

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక కూటమి ప్రభుత్వం అనేక అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిందని విమర్శించారు. జైల్లో ఉన్న కాకాణిని ములాఖత్ ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించాలని అనుకుంటే పలు దఫాలు అడ్డంకులు సృష్టించి అడ్డుకున్నారని విమర్శించారు. తాజాగా పర్యటన ఖరారైతే హెలిప్యాడ్, జైలు వద్దకు మూడు కార్లు, పది మంది మాత్రమే ఉండాలని ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. అక్కడి నుంచి మాజీ మంత్రి ప్రసన్నకుమారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించే సమయంలో కూడా ఆంక్షలు విధించడం గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కుట్రపూరితమైన ఆంక్షలు విధించడం, వీటిని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం మోపే అక్రమ కేసులకు ఎవరూ భయపడే ప్రసక్తే లేదని, ఆంక్షలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని తొలగించలేరని స్పష్టం చేశారు. తాము బస్సులు, ఇతర వాహనాలు పెట్టి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు తరలించడం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పలు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీఈఆర్టీ భవన నిర్మాణాలకు భూమి పూజ



ఎన్సీఈఆర్టీ భవన నిర్మాణాల భూమి పూజలో పాల్గొన్న అధికారులు

వెంకటాచలం: మండలంలోని చవటపాళెం వద్ద రూ.347.96 కోట్లతో 50 ఎకరాల్లో నిర్మించనున్న నేషనల్ కౌన్సిల్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్సీఈఆర్టీ) భవన నిర్మాణాలకు మంగళవారం భూమి పూజ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఎన్సీఈఆర్టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనరసింహ దంపతులు, ప్రొఫెసర్ బుర్రా రమేష్‌బాబు, జి.విష్ణుతప్ప, డాక్టర్ ప్రకాష్ బడిగర్, డాక్టర్ కన్నన్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ నవీంద్రబాయ్ శాస్త్రోక్తంగా చేపట్టారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ ఎన్సీఈఆర్టీ భవనాల నిర్మాణాలకు టెండర్లు కూడా పూర్తి కావడంతో పనులు త్వరలో ప్రారంభిస్తారని చెప్పారు. ఈ నిధులతో పాఠశాల, అకడమిక్ భవనాలు, గ్రంథాలయం, ల్యాబ్‌లు, విద్యార్థుల, సిబ్బంది వసతిగృహాలు నిర్మిస్తారని తెలిపారు.

క్లుప్తంగా

తండ్రిని వెతుక్కుంటూ..



మాట్లాడుతున్న సోనియా, సుబ్బు

మనుబోలు: ఉపాధి కోసం ఇతర ప్రాంతానికి బయలుదేరి తప్పిపోయిన తన తండ్రిని వెతుక్కుంటూ కుమార్తె తన భర్తతో కలిసి రాష్ట్రాలు దాటి మంగళవారం మనుబోలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. వివరాలిలా ఉన్నాయి. అసోం రాష్ట్రానికి చెందిన దింభేశ్వరి స్వర్గియారి అనే 50 ఏళ్ల వయసున్న వ్యక్తి రైల్లో బెంగళూరుకు బయలుదేరాడు. 23వ తేదీన విజయవాడ రైల్వేస్టేషన్‌లో దిగాడు. అయితే తిరిగి రైలు ఎక్కలేకపోయాడు. దీంతో అక్కడి నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో బెంగళూరుకు బయలుదేరాడు. మనుబోలు వద్ద వేకువజామున కాలకృత్యాల కోసం బస్సు ఆపగా దిగాడు. తిరిగి ఎక్కకపోవడంతో సిబ్బంది అతడి బ్యాగు, అందులో ఉన్న సెల్‌ఫోన్ ఆధారంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుమార్తె సోనియా, అల్లుడు సుబ్బు మనుబోలుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

• వ్యక్తి మృతి



భాస్కర్ (ఫైల్)

దగదర్తి: మండలంలోని సున్నపుబట్టి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మారుపూడి భాస్కర్ (45) దగదర్తి వాసి. సోమవారం రాత్రి నెల్లూరు నుంచి తన స్వగ్రామమైన దగదర్తికి బైక్‌పై వస్తున్నాడు. సున్నపుబట్టి జామాయిల్ చెట్ల వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. భారీ వాహనాలు శరీరంపై దూసుకెళ్లడంతో ఛిద్రంగా మారింది. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భాస్కర్ బోగోలు మండలం నాగులవరం సచివాలయ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ సస్పెండ్ అయ్యాడు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ మంగళవారం తెలిపారు.

కేసుల పేరుతో భయపెట్టి రూ.15 లక్షల దోపిడీ

నెల్లూరు(క్రైమ్): సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని కేసుల పేరుతో బెదిరించి నగదు దోచుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నెల్లూరు నగరానికి చెందిన ఆంజనేయులు గాంధీబొమ్మ వద్ద దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడికి ఈనెల 26వ తేదీన గుర్తుతెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తన పేరు గౌరవ సారథి అని, బెంగళూరు పోలీస్ శాఖ నుంచి మాట్లాడుతున్నాని చెప్పాడు. మీపై మహిళలను వేధిస్తున్న కేసు, సీఐడీలో మరో కేసు నమోదైందన్నాడు. ఈ రెండు కేసులను నిలుపుదల చేయాలంటే రూ.15 లక్షలు తాను చెప్పిన బ్యాంక్ ఖాతాకు పంపాలని సారథి సూచించాడు. దీంతో దుకాణదారుడు ఆ ఖాతాకు రూ.15 లక్షలు పంపించగా మరికొంత నగదు కావాలని డిమాండ్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన దుకాణదారుడు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎకరాకు రూ.5 లక్షల పరిహారమివ్వాలి

సైదాపురం: స్థానిక పంచాయతీలోని కమ్మవారిపల్లెలో నిమ్మతోటల రైతులకు ఎకరాకు రూ.5 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లించాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.సుబ్బరాయుడు పేర్కొన్నారు. తొలగించిన నిమ్మతోటలను రైతు కూలీ సంఘం ప్రతినిధులు మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులు తురకా మస్తాన్, శశికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లను జేసీబీలతో తొలగించడం దారుణమన్నారు. 8 నెలలుగా మైనింగ్ మాఫియాతో ప్రభుత్వం కుమ్మక్కై ఎస్సీ, ఎస్టీ, బీసీలను వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 26.792 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 26.792 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,873, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

‘బూడిద కమ్మిన మార్గం’

లారీ వెళ్లే సమయంలో ఇలా..





గుట్టలుగా వేసిన బూడిద

చెన్నై, కోల్‌కతా జాతీయ రహదారిలో నెల్లూరు నగర పరిధిలోని కనుపర్తిపాడు జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. వంతెన నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు బూడిద తోలారు. ఇది వాహన చోదకుల పాలిట శాపంగా మారింది. ఈదురు గాలులకు ఈ బూడిద ఎగసి లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లే వారి కళ్లల్లో పడుతుండటంతో ఇబ్బందులతోపాటు ప్రమాదాల పాలవుతున్న పరిస్థితి నెలకొంది. నగర పరిధిలోని వారే కాక ఈ మార్గంలో వెంకటాచలం, గూడూరు తదితర ప్రాంతాలకు బైక్‌ల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే తిరుపతి వైపు నుంచి వాహనదారులు వస్తుంటారు. గాలికి బూడిద కళ్లల్లో పడుతుండటంతో వారంతా అవస్థలు పడుతున్నారు. జాతీయ రహదారుల నిర్మాణం సంస్థ పనులను వేగవంతం చేయడంతోపాటు దుమ్ము నియంత్రణకు చొరవ చూపాల్సిన వారు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



గాలికి ఎగిరిన బూడిద

ఆశ చూపి.. నగదు దోచేసి..

సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి చాలామంది తక్కువ వ్యవధిలో అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని ఆశపడి ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నగదు పెట్టొద్దని పోలీసు అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కానీ అనేకమంది మోసపోతూనే ఉన్నారు.

- ట్రేడింగ్ పేరిట మోసాలు
- లాభాలొస్తాయని పెట్టుబడి పెట్టిస్తున్న కేటుగాళ్లు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు
- సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త

నెల్లూరు(క్రైమ్): జిల్లాలో సైబర్ మోసాలు చాప కింద నీరులా వ్యాపిస్తున్నాయి. ఏటా బాధితులు పెరుగుతున్నారు. రూ.కోట్లలో తమ నగదును కోల్పోతున్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. సోషల్ మీడియా వేదికగా చైతన్యవంతుల్ని చేస్తున్నా.. ఏదో ఒక విధంగా మోసానికి గురవుతూనే ఉన్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఫిర్యాదులు అధికంగా ఉంటున్నాయి.

ఉచ్చులో చిక్కి..

టెక్నాలజీ ఎంత పెరిగిందో ఆన్‌లైన్ మోసాలు అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు అంది వచ్చిన ఏ అవకాశాన్ని వదలడం లేదు. రకరకాలుగా ప్రజలను మోసగించి పెద్ద మొత్తంలో నగదు దోచేస్తున్నారు. ముఖ్యంగా చదువుకున్న వారు, ఉన్నత ఉద్యోగులు, గృహిణులు నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుపోతున్నారు. నగదు పోగొట్టుకున్న విషయం ఎవరికీ చెప్పుకోలేక, పోయిన డబ్బులు వస్తాయో? రావో? తెలియక సతమతమవుతున్నారు.

ఎలా అంటే..

ట్రేడింగ్‌లో నైపుణ్యం కలిగిన వ్యక్తులమంటూ నేరగాళ్లు వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా యాప్స్‌లో మెసేజ్‌లు చేస్తున్నారు. తమ సలహాలు, సూచనలు పాటిస్తే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ మొత్తంలో లాభాలు పొందవచ్చని నమ్మిస్తారు. అనధికారిక అప్లికేషన్ లింక్‌లను పంపుతూ వారు రూపొందించిన మోసపూరిత వెబ్‌సైట్లలో పెట్టుబడులు పెట్టేలా ప్రేరేపిస్తున్నారు. ప్రారంభంలో కొంత లభాలు వస్తున్నట్లు చూపుతూ ఎక్కువగా పెట్టుబడులు పెట్టేలా చేస్తున్నారు. లాభాలు వచ్చినట్లు చూపించి తిరిగి నగదు తీసుకునే అవకాశం లేకుండా చేస్తున్నారు. ఇలాంటి ప్రకటనలు సైబర్ మోసమని గ్రహించాలని, అత్యాశకు పోయి ఉన్నది పోగొట్టుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930, సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి.





సైబర్ నేరాలపై ప్రజలను చైతన్యపరిచే పోస్టులు

కొన్ని ఘటనలు

• నెల్లూరు నగరానికి చెందిన ఓ వ్యక్తికి ఫేస్‌బుక్‌లో లిఖితాశ్రీ అనే మహిళ పరిచయమైంది. ఫారెక్స్ ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించింది. దీంతో ఆ వ్యక్తి పలు దఫాలుగా రూ.10.30 లక్షలు పెట్టుబడి పెట్టాడు. కొన్నిరోజులకు లాభాలు రాలేదు. నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా ట్యాక్స్ కింద రూ.లక్ష కడితే మొత్తం డబ్బులు పొందవచ్చని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

• నెల్లూరు నగరానికి చెందిన ఓ మహిళకు ఇన్‌స్టాగామ్‌లో మెసేజ్ ద్వారా లింక్ వచ్చింది. దానిపై క్లిక్ చేయగా తన వాట్సప్ నంబర్‌కు నిషాబసు అనే మహిళ చాటింగ్ ప్రారంభించింది. ఓ ప్రముఖ కంపెనీకి చెందిన దానినని ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో సలహాలు ఇచ్చి లాభాలు వచ్చేలా చూస్తామని నమ్మించింది. తొలుత మహిళ వద్ద నుంచి కొంత మొత్తం పెట్టుబడి పెట్టించి రెట్టింపు లాభం వచ్చేలా నమ్మించింది. దీంతో మహిళ పలు దఫాలుగా రూ.2.46 కోట్లు పెట్టుబడి పెట్టింది. నిందితులు ఆమె ఖాతాలో రూ.4.02 కోట్లు ఉన్నట్లు చూపించారు. విత్‌డ్రా చేసేందుకు యత్నించగా రాలేదు. లార్జ్ ట్రాన్సాక్షన్ కోసం మరో కొంత నగదు చెల్లించాలని నిందితులు సూచించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

• నెల్లూరు నగరానికి చెందిన ఓ వ్యక్తిని ఆన్‌లైనింగ్ ట్రేడింగ్ పేరిట నమ్మించి రూ.1.01 లక్షలు పెట్టుబడి పెట్టించారు. రూ.3.50 లక్షలు లాభం వచ్చిందని సైబర్ నేరగాళ్లు చెప్పారు. ఆ మొత్తం తీసుకోవాలంటే తమ కమీషన్ రూ.60 వేలు పంపాలన్నారు. కమీషన్ ఎందుకు పంపాలని అతను నిలదీయడంతో ఫోన్‌లు స్విచ్చాఫ్ చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆహో.. కట్టుకథలు చూడండి

- అర్ధరాత్రి గిరిజన మహిళల అరెస్ట్
- మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లుగా రిమాండ్ రిపోర్టు
- విస్తుపోతున్న ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నేతలు
- కూటమి ప్రభుత్వంలో పావులుగా పోలీసులు



ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు చెబుతున్న రిమాండ్ రిపోర్టు

ఉలవపాడు: కూటమి ప్రభుత్వంలో పోలీసులు పాలకులు చెప్పినట్లుగా తలూపుతూ జీ హుజూర్ అంటున్నారు. ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి గిరిజన మహిళలను అరెస్ట్ చేసి తీసుకొచ్చారని వందలాది మంది స్టేషన్ ముందు ధర్నా చేస్తే.. పోలీసులు మాత్రం తాపీగా 26వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు అరెస్ట్ చేసినట్లు రిమాండ్ రిపోర్టులో చూపించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు అర్ధరాత్రి అరెస్ట్‌లు దారుణమని ఖండించిన తర్వాత కూడా సమయం మార్చి చూపించడమంటే కోర్టును తప్పుదోవపట్టించడమే కదా అనే అనుమానం కలగక మానదు.

రిమాండ్ రిపోర్టులో ఇలా..

ఈనెల 25వ తేదీ కరేడు పంచాయతీ రామకృష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు జూపూడి ప్రభాకర్‌రావు, రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీను, ఉపాధ్యాయుడు కేశవరపు జాలిరెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఇండోసోల్ ప్రాజెక్ట్ భూములకు వ్యతిరేకంగా వారు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి శేషమ్మ అనే మహిళ వెళ్లలేదు. ఆమె ఇల్లు ఖాళీ చేసి వెళ్లడానికి సిద్ధంగా ఉందని రిపోర్టులో రాశారు. నేతల సమావేశం పూర్తై వెళ్లిన తర్వాత శేషమ్మ గ్రామంలోని కల్పన కూల్‌డ్రింక్ షాపు వద్ద ఉన్న సమయంలో ముగ్గురు మహిళలు వెళ్లి గొడవ చేసి గాయపరిచినట్లు పొందుపరిచారు. ఈ విషయమై శేషమ్మ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అదేరోజు రాత్రి 10 గంటలకు కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం వైద్యాధికారికి ఫిర్యాదును పంపించారు. ఎస్సై అంకమ్మ అదేరోజు రాత్రి రామకృష్ణాపురంలో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దాడి చేశారని చెబుతున్న గిరిజన మహిళలకు నోటీసులు అందించి స్టేషన్‌కు తిరిగొచ్చారు. సదరు మహిళలు స్టేషన్‌కు వచ్చారు. అయితే వారు ఎన్ని గంటలకు వచ్చారనే సమయాన్ని రిపోర్టులో చేర్చలే దు. 26వ తేదీన వైద్యాధికారి శేషమ్మకు గా యాలు అధికంగా ఉన్నాయని సర్టిఫికెట్ ఇచ్చారు. దాని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో మెమో దాఖలు చేశారు. సదరు మహిళల్ని అరెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని, లేకుంటే మరికొందరిపై దాడి చేసే పరిస్థితి ఉందని రిపోర్టులో వెల్లడించారు. ముగ్గురు గిరిజన మహిళల్ని ఏ1, ఏ2, ఏ3గా పెట్టి 26వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు స్టేషన్ వద్దే అరెస్ట్ చేసినట్లు చూపించారు. మహిళా పోలీసుల సమక్షంలో 13.15 నిమిషాలకు కోర్టుకు హాజరుపరుస్తూ పూర్తి విచారణ చేసేందుకు 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని ఎస్సై అంకమ్మ కోర్టుకు విన్నవించినట్లు రిపోర్టులో ఉంది. దీనిపై ప్రజాసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- ఆటో బోల్తా
- ముగ్గురికి గాయాలు

సోమశిల: చేజర్ల మండల పరిధిలోని పడమటికంబ్రిక వద్ద ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలైన ఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. బుజబుజనెల్లూరుకు చెందిన ఓ కుటుంబం దాచూరులోని నాగార్పమ్మ ఆలయానికి ఆటోలో బయలుదేరింది. పడమటికంబ్రిక గ్రామానికి సమీపంలో రోడ్డు కుంగిపోవడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రోడ్డు కుంగిపోవడంతో పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కుంగిపోయిన రోడ్డును చూపుతున్న ప్రయాణికుడు



108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు

అగ్నికి ఆహుతైన గానుగ మిల్లు

- రూ.10 లక్షల ఆస్తి నష్టం
- అక్కసుతో పెట్రోలు పోసి తగులబెట్టారు
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు




వెంకటరమణయ్య, బాధితుడు



గానుగ మిల్లు

సంగం: గానుగ మిల్లు మంటల్లో కాలిపోవడంతో రూ.10 లక్షల నష్టం వాట్లింది. తమ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు ఇలా చేశారని మిల్లు యజమాని వెంకటరమణయ్య మంగళవారం సంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులోని వివరాల మేరకు.. మండలంలోని పడమటిపాళెం పల్లిపాళేనికి చెందిన ఇండ్ల వెంకటరమణయ్య గ్రామ మాజీ సర్పంచ్. వ్యవసాయం చేస్తుంటాడు. ఇతడికి రాజగోపాల్ అనే కుమారుడు ఉన్నాడు. గ్రామ సమీపంలోనే నాలుగేళ్ల క్రితం వేరుశనగ ఆడించే మిల్లును సుమారు రూ.7 లక్షలతో పెట్టారు. తండ్రీకొడుకులు సోమవారం రాత్రి మిల్లును చూసి ఇంటికెళ్లారు. అర్ధరాత్రికి మిల్లు మంటల్లో కాలిపోతుండగా అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు వివాహానికి వెళ్తూ గమనించి వెంటనే బాధితులకు తెలియజేశాడు. వారు మరో 10 మందితో వచ్చి మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. మిల్లు పైనున్న రేకును తొలగించి పెట్రోల్ పోసి తగులబెట్టారని బాధితులు ఆరోపిస్తున్నాడు. లోపల రెండు డ్రమ్ముల్లో ఉన్న 300 కిలోల నూనె, 20 బస్తాలు వేరుశనక్కాయలు, వేరుశనగ చెక్క, గానుగ మెషినరీ కాలిపోవడంతో సుమారు రూ.10 లక్షల మే ఆస్తినష్టం వాటిల్లిందని కన్నీరుమున్నీరుగా విలపించారు. సంగం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 126
లేయర్ (లైవ్)	: 112
బ్రాయిలర్‌చికెన్	: 228
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 252
లేయర్ చికెన్	: 190

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.24
సన్నవి	: రూ.15
పండ్లు	: రూ.5

